వెళ్ళినట్లు తెలుగువాడు పచ్చళ్ళ భోగి కదా – ఊరగాయల సంగతి సరే సరి. 'బఫే'లో యివి కలుపుకుని తినాలంటే ముందువాడి వీపుమీద మన ప్లేటు పెట్టుకుని తినాల్సిందే. అయితే యిటీవల కర్డ్ రైస్, సాంబార్ రైస్, కిచిడీ రైస్ అని కలిపేసిన ఫుడ్లు రడీగా పెంచుతున్నారు. గుడ్డిలో మెల్లలాగ యిది కొంత మేలేకాని కలుపుకుని జుర్రుకుని తినే యోగం మాత్రం కాదు. భోజనం కూడా ఒక యోగం – ఇవన్నీ తిన్నాక పాయసం, మధ్యలో స్వీట్లు, చివరన ఐస్‌క్రీమ్. లేదా కాఫీ – యీ విషయసూచిక అంతా పూర్తి చేసేసరికి చేతులు లావెక్కిపోతాయి, బట్టల మీద పడ్డాయో ఎంత ఖరీదైన పట్టుచీరయినా డాగులుపడికళంకితమవుతుంది.

'బఫే' డిన్నర్లలో మన భోజన మర్యాదలు ఆహుతి అయిపోతాయి. ఇంకాస్త తినండి, మళ్ళీ వేయించుకోండి. అప్పుడే లేస్తారా అని మొహమాటం పెట్టే తంతువుండదు. 'బఫే' డిన్నర్లలో అన్నదాత (కన్యదాత)కి గెస్టుకి మధ్య హోటల్‌వాడు దూరుతున్నాడు. అతిథికి, యజమానికి మధ్య వుండే సంబంధం పలచనయి పోతుంది. ఈ మాయామేయ జగత్తులో 'బఫే' డిన్నరు కూడా ఒక మాయ – వడ్డించే వాడూ తినేవాడూ కూడా ఒక్కరే. సర్వింగు బల్లల ఖర్చు ఏమీ వుండదు. నిలబడి తినేవాడు వాడి మొహం ఏం తింటాడు విస్తరాకుల్లో పారేసే వేస్ట్ లాటిది వుండదు – యిది ఎకానమీకి ఎకానమీయే కాని తెలుగు భోజనానందానికి కడు దూరం.

మా వారి మిత్రులు ఐ.జె. రావుగారన్నట్లు పెద్ద పెద్ద 'బఫే' పార్టీలకు వెళ్ళివచ్చాక యింటికొచ్చి యింత ఆవకాయ, పెరుగు అన్నం తింటేనేగాని ఆత్మ శాంతించదు, జీవుడి వేదన 'అణగారదు'ట. మీరే మంటారు? హెల్ప్ యువర్ సెల్ఫ్ అంటారా? ఇంకాస్త పప్పుపులుసు మరో రెండు బొబ్బట్లు వెయ్యమని అంటారా? జైహింద్!

# మా వీధి నాటకమ్

ఊరిఖే వీధి చివర్న నిలబడి దిక్కులు చూసే కుర్రాళ్ళని, వాళ్ళ నోట్లో సిగరెట్లని చూస్తే మీకేమనిపిస్తుంది? వూచి పుచ్చుకు దవడ పేలి పోయే లాగా ఓటిచ్చుగోవాలనిపించదూ! పాపము శమించుగాక! ఆ కుర్రాడు మీ తమ్ముడు కావచ్చు, చిన్న మరిది కావచ్చు, మీ కొడుకే కావచ్చు–కాని, గుబ్బగలకొట్టేది సిగరెట్టు కాలుస్తున్నందుకు గాదు, జీవితంలో మళ్ళీ తిరిగిరాని విలువైన కాలాన్ని వేస్ట్ చేస్తున్నందుకు.

కిల్లీ కొట్ల ముందు నిలబడి గప్పుగా సిప్పు కొట్టడం, వీధిలో సినిమా పోస్టర్ల ముందు నిలబడి పోసుకోలు కబుర్లు చెబుతూ కాలక్షేపం చెయ్యడం, కాఫీ హోటళ్ళలో బల్లల చుట్టూ చేరి గంటల తరబడి చాలు, కబుర్లు, సిగరెట్లతో కాలం గడిపెయ్యడం, సినిమా హాళ్ళ దగ్గర

పోగయి చవకబారు కబుర్లు చెప్తూ వింటూ నిర్లక్ష్యంగా బతకడం – యిలా బతికేసే కుర్రాళ్ళు చివరికి కొంప ముంచే ‘ ‘నేషనల్ డెట్’ జాతీయ ఋణ పతాకం క్రింద తయారై పోతే ఆశ్చర్యం ఏం వుందీ?

మా వీధి కూడా ఒక పెద్ద మూర్ఖా గ్రేసర చక్రవర్తిలా వుంటుంది. ఏవడేనా కోపంగా తిన్నగా నడుచుకెళ్తే వెళ్ళి కాలవలో పడ్తాడు. మా వీధి కత్తిరించిన కంద పద్యంలా వుంటుంది. మా వీధిలో ఎవరేనా ఫరెగ్జాంపుల్ దొంగని తరుముకుంటూ వెళ్తే వెళ్ళి వెళ్ళి తరిమిన వాడు పోలీసైతే – పోలీసు దొంగా యిద్దరూ కలిసి కాలవలో పడ్తారు. కోడలు అత్తగార్ని తరిమినా అత్తగారు కోడల్ని తరిమినా వుభయులూ ఆ కాలువలోనే పడతారు విత్ వాటర్ ఆర్ వితవుట్ వాటర్. క్రాస్ రోడ్లు లేని మా వీధి మీసాల్లేని దుర్యోధనుళ్ళా వుంటుంది. మా వీధిలోంచి నారాయణుడు నడిచినా నరుడు నడిచినా మార్గాంతరం అనేది లేనేలేదు. మా వీధిలో ఓ పక్కన చాలా పెద్దచెట్టువుంది. అది వీధిలోకి లేదు – పక్కగా ఆకాశాన్ని ఎదిరిస్తూ నిలబడ్డట్లు వుంటుంది. ఆచెట్టు కేసి చూస్తూ వుంటే ఎన్ని రంగులు మారుస్తుందో? అలా వూగుతూ మన్ని పిలుస్తున్నట్లు కనిపిస్తుంది. దాని మీద ఓ పెంకి కోయిల కూచుని ‘కో’ యంటే ‘కో’ యంటుంది. స్కూలు కెళ్ళే పిల్లలు, కొంత మంది పెద్ద వాళ్ళు కూడా ఆ కోయిలను ‘కో’ యని రెట్టించి అదిమారు పలికితే కవ్వించి కవ్వించి ఆనందిస్తూ వుంటారు. మా వీధి మురుక్కాలవ మీద ఎన్ని చిన్న చిన్న బడ్డీ కొట్లు వున్నాయో చెప్పలేం? పొడి బట్టలు యిస్త్రీ చేసే బండి, జంగిట్లో తినుబండారాలు అమ్మే ముసలమ్మ, నిమ్మ కాయలమ్మే ఆడమనిషి, కూరలమ్మే స్త్రీ, అక్కడే ఆడుకునే పసిపిల్లలూ, టైలర్లూ ఆ పక్కనే సైకిళ్ళకి పంచర్లూ రిపేరీలు జేసి గాలి కొట్టే సలీమూ, పాత సైకిలు టైర్లు దొర్లించుకుంటూ ఆడుకునే పిల్లలూ, ఒకటి రెండు బార్బరుషాపులు, గోళీ కాయలాడే వాళ్ళూ, ఈ మధ్యలో కావిళ్ళ మీద పళ్ళో, కూరలో అమ్మే వాళ్ళు, సైకిళ్ళ మీద కట్‌పీసు బట్టలూ, చీరలూ, జాకిట్ పీసులూ అమ్మేవాళ్ళు, ప్లాస్టిక్ సామానులూ, జర్మన్ సిల్వర్ వస్తువులూ, గాజు వస్తువులూ, ప్లాస్టిక్ బాల్చీలు అమ్మే వాళ్ళూ, పాత బట్టలకు స్టీలు గిన్నెలు యిచ్చే వాళ్ళూ – యిలా మా వీధి వీధంతా ఒక తెరపడని నాటకంలా సాగిపోతూ వుంటుంది. మా వీధి పోలీసు వాసనేస్తూ వుంటుంది. కాకీవనం అన్నా అనొచ్చు. వీధి అంతా వాళ్ళే ఆక్రమించుకుని కబుర్లు చెప్పుకుంటూ వుంటారు. చిత్రం ఏవిటంటే – ఎదురుగుండా మరో మనిషి గాని, వాహనంగాని ఎవరు వచ్చినా తప్పుకోరు, దారివ్వరు. వచ్చే పోయే వాళ్ళకి యిబ్బంది కలుగు తుందేమోనని కాస్తన్నా ఆలోచించరు.

ఈ మధ్యలో స్కూలు పిల్లల రిక్షాలు, గూడు బళ్ళు, వాళ్ళనెక్కించుకున్న సైకిళ్ళు, కాలినడకలతో, పరుగులతో, వురుకులతో పరిగెడుతున్న చైతన్యంలా గంతులు వేసే యిస్కూలు పిల్లలూ, వాళ్ళ వెనకే చిరుచెమటలతో, కేరేజీలతో అలసిసొలసి చిరు సింగారాలతో, చిన్న చిన్న వయ్యారాలతో వీధినంతా దివ్య మంగళం చేసి చిరునవ్వులతో వెలిగించే కాలేజీ అమ్మాయిలూ – సడన్‌గా మా వీధి రూపు మారిపోతుంది. మా వీధిలో వో ముసలాయన

వంటి మీద చొక్కా లేకుండా నీరుకావి పంచె కట్టుకుని, మరో నీరుకావి పైపంచెతో, చేతిలో ఓ ప్లాస్టిక్ డబ్బా పట్టుకుని ప్రతి కొట్టు దగ్గర నిలబడతాడు. వీధిలో వొచ్చే బళ్ళవాళ్ళని ఆపి అన్నీ బేరమాడతాడు. కొత్తవాళ్ళనీ, పాతవాళ్ళనీ అందర్నీ నవ్వుతో పలకరిస్తాడు. వెళ్ళి వెళ్ళి కారబ్బూంది, పకోడీ, కారప్పూస అమ్మే బండి దగ్గర నిలబడతాడు. ఎవరేనా తెలిసినవాళ్ళు తనకో కారప్పూస పొట్లమో, పకోడి పొట్లమో కొనిస్తారేమోనని. అతను నడిచేప్పుడు చాలా జాగ్రత్తగా నడుస్తాడు రోడ్డంతా చూసుకుంటూ ఆ ముసలాయనకి అప్పుడప్పుడు పిల్లలు పారేసుకున్న పెన్సిలు ముక్కలు, రబ్బర్లు, ఐదు పైసలు - పది పైసల బిళ్ళలూ దొరికితే తీసుకుని ఆ ప్లాస్టిక్ డబ్బాలో వేస్తాడు. అప్పుడప్పుడు టీ కొట్టుకేసి చూస్తాడు ఎరిగున్నవాళ్ళెవరేనా పిలిచి 'టీ' యిప్పిస్తారేమోనని.

మా వీధిలో కొంతమంది ఆడపిల్లలు పరికిణీలు ఎగ్గట్టి సైకిలు తొక్కడం ప్రాక్టీసు చేస్తూ వుంటారు. ఒక అమ్మాయి సీటు మీద కూర్చుంటే ఇద్దరు ముగ్గురు ఆడపిల్లలు ఆ సైకిల్ని పట్టుకునో, తోస్తూనో, వెనక పరిగెడుతూనో కనిపిస్తారు. నూన్ షోలకు, మాట్నీలకు వెళ్ళి కబుర్లాడుతూ వచ్చే ఆడ గుంపులకు వాళ్ళ చంకల్లోని పసిపిల్లలకు, వారి వెనక నడిచే పెద్ద పిల్లలకు గొడుగుపడుతూ ఒక నీలిమేఘం కొండ వైపు నుంచి కృష్ణ వైపు పరుగులు తీస్తూ వుంటుంది.

ఏవీ బిడియాలు పడకుండా నిస్సంకోచంగా నవ్వు కుంటూ, కబుర్లాడుకుంటూ, బుగ్గలు నొక్కుకుంటూ, కళ్ళు తిప్పుతూ, దువ్వని తలలతో, దువ్విన తలలతో, నలిగిన పూలచెళ్ళతో, నలగని పూల చెళ్ళతో, రంగుల రిబ్బన్లతో కొంతమంది కష్టకమలలు నెత్తి మీద బాల్చీలు బిందెలు, వాటిల్లో వుతికిన తడి బట్టల చుట్టలతో కాలవ నించి నడిచిపోతూ వుంటారు. ఈ ప్రపంచంలో ఎక్కువ దుఃఖవే వుందా, అంత సంతోషమూ సుఖమేనా వుంది అంటే మా వీధిని చూసి తేల్చి చెప్పడం కష్టం.

మా యింటికి, మా వారి ఆఫీసుకి అరఫర్లాంగే దూరం. అయితేనేం? ఆ కాస్త దూరాన్నీ అష్టాదశ వర్ణనలూ జోడించి చెప్పుకోవాలంటే ఎంతయినా చెప్పుకోవచ్చు!

ఆ కాస్తదూరంలో కొట్ల ముందు నుంచుని, బాతాఖానీలు కొడుతూ నిలబడిపోయి వున్న మనుషులు దారిని అడ్డేస్తారు కాని, ఎవరికీ దారివ్వరు. వాళ్ళని కూడా తప్పించుకుని పోవాల్సిందే ముందుకి. సెంటర్లలో, రోడ్డు మొగలో జనం నిలబడిపోతారు నిర్వ్యాపకంగా- యింత మంది జనం పనీ పాట లేకుండా లేజీగా చుట్టలు కాలుస్తూ, దిక్కులు చూస్తూ గడిపేస్తుంటే 'దేశమే గతి బాగుపడునోయ్' అనిపిస్తుంది.

పని చేయకపోవడం గౌరవం, హోదా అనుకుని, కష్ట పడి పని చేయడం తప్పకుండా నామోషీ అనుకునే దేశంలో 'దేశమంటే మట్టి కాదోయ్' అని చెప్పి మటుకు ఏం ప్రయోజనం? ఏ దేశ మేగినా ఎందు కాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని - అదొక్కటే మనకు తెలుస్. ప్చ్!